ఓ ఉదయం

(దీర్ఘ కవిత)

రచన

డా॥ వాసా ప్రభావతి

హైదరాబాదు

ఫోన్ : 24549178

వాసా ప్రచురణలు

మునిసిపల్ కాలనీ

మలక్ పేట, హైదరాబాదు-500 036

O' UDAYAM

(Long Poem)

by

Dr. VASA PRABHAVATHI

First Edition

December, 2002

Price

Rs. 60 /-

Cover Design

Seelaa Veerraju

Inner Figures

Indrajit

For Copies

J. Meenakshi,

Vasa Nilayam, 11/2 RT - 16-10-27/ 144

Municipal Colony, Malakpet,

Hyderabad - 500 036.

Ph. (040) 24549178

&

Visaalandhra Publishing House,

Vignan Bhawan, Hyderabad

and all its branches.

Laser Type setting, Page Make-Up & Illustrations

Jayanthi Publications

19 - 90, P & T Colony,

Dilsukh Nagar,

Hyderabad - 500 060.

Ph. (040) 24042446

అంకితం



సౌమ్యతే అలంకారమై

నిరాడంబరత్వమే నిజాయితీ పీఠమై

అందరికీ తలలో నాలుకై

మానవత్వం పునాదులపై

మంచి హృదయంతో

వికసించిన రాజకీయ దురంధరులు.

'తుని' నియోజక వర్గానికి ప్రతినిధులు,

ఆర్థిక శాఖామాత్యులు,

శ్రీ యనమల రామకృష్ణుడు గారికి

కళాభివందనములతో

'ఓ ఉదయం' కవితను

సమర్పిస్తున్నాను.

- కవయిత్రి

ఓ ఉదయవేళ!



ఆ ఉదయ ఆవిర్భావానికై

జ్ఞానోదయమైన మునివర్యునిలా
తపస్సమాధి నుండి
తెరచిన నేత్ర ద్వయాలతో కొలిచే
మనిషి ఎదురుతెన్నులు.
అరుణ రాగరంజితమై
అనంతకోటి ప్రభలతో
కొత్త సింగారాలు సవరిస్తూ

కర్తవ్యం ప్రబోధించే గమనంతో
దీక్ష బూనిన వేగంతో
భూమ్యాకాశాల మధ్యలో
ఓ అనంతధామంలా
మనిషి , అంతరాత్మ మధ్య
కదలాడే వెలుగులా
జనన మరణాల మధ్యలో
తాండవించే జీవితంలా
మెళకువ, నిద్ర మధ్య వ్యవధిలో
లోకాన్ని తన గుప్పిట పట్టాలని
పరిభ్రమించే మనస్సులా
ఓ వెలుగు వెల్లువ.
ఓ ఉదయా గమనం.
ఓ హృదయ సంజాతకం.
ఉదయం ఓ జననం.
ఉదయం ఓ ఆరంభం.
ఉదయం ఓ నవచైతన్యం.
మానవ జీవన నవ్య కళారూపం
ఓ ఉదయం!

ఓ ప్రభాత వేళ!



ఊరంతా వెలుగు చిమ్మేవేళ

ఊరెడు మంది హృదయాలు

భక్తితో పల్లవించే వేళ

ఊరి మధ్యలో గుడిగంటల ధ్వానాలు

పురోహితుల వేద మంత్రాలతో

నాలుగు దిక్కులు మారుమ్రోగే వేళ

సుప్రభాతాలతో భక్తులను వెంట నడిపించే వేళ

వారి హృదయాలు పరవశించే వేళ!

ఏదో తెలియని ప్రశాంతత, ఏదో తెలియని పారవశ్యం-
అందరినీ అలుముకున్న వేళ, అణువణువు పులకించే వేళ
భక్తులు పూజలు చేసేవేళ!
వికసించిన పూలన్నీ ఆ దేవుని పాదాల చెంతకే చేరాలని
సుప్రభాత వేళలో విచ్చుకునే పూలెన్నో!
మనో పుష్పాలను అర్పించుకునే
భక్తపుంగవులెందరో..?!
యాంత్రిక జీవన నియంత్రణకు
దురాలోచనల దుష్టతలంపుల మళ్లింపునకు ఆ దేవళం
ఓ సన్మార్గ సాధనం!
దేవుడు ఉన్నాడా, లేడా... అంటే
లేడనే వారున్నారు కాని,
ఆ దేవుని రూపురేఖలను, ఆ దేవుని గుణగణాలను
కాదనే వారెవ్వరు?
కంటికి కనపడేది- మట్టి, రాతి, పాలరాతి, కంచు విగ్రహమైనా
మనో నేత్రానికి గోచరించేది- ఓ అనంత తేజోమయ స్వరూపం!
కర్తవ్యం బోధించే ఆ గీత
యుగయుగాలకు ప్రతీక!
ఆత్మశాంతికి ఆధారం ఆ భక్తి!
ఏ కాలంలోనైనా మూఢభక్తికి,
మూఢాచారాలకు కాలం చెల్లుతుంది!
ఆ దేవుని ఆవాసం మనిషి హృదయం.
ఆ దేవుని స్వరూపం మనిషి.
మానవత్వపు పూదోటలో
పరిమళించేవాడు ఆ మనిషి
మానవ సేవే ఆ మాధవ సేవ!

ఓ దీపాల పందిరి!




ఓ ఉదయం!

ప్రతి ఉదయం!
జననానికి నిత్య ఆవిర్భావంలా
జీవితమే ఓ వెలిగే దీపశిఖయై
వేల జీవితాలలో వెలుగు పండించే
ఓ మంత్రదీపంలా
తూర్పు కొండ శిఖరం పైనుండి
అఖండ సూర్యోదయం!

అప్పటివరకు ఆకాశాన్ని కొలుస్తూ
భూమాతకు దీపాల పందిరై
రాత్రి డ్యూటీ చేసే
కాపలావానిలా
మనిషి కర్తవ్యం.
విడదీయరాని బంధాలుగా
ఆకాశ హార్మ్యం నుండి
ఆ చంద్రుడూ, తారలు
నిష్క్రమించే సమయం.
కాలం ఆంక్షలు
ఎంతటి వారికైన శిరోధార్యమే!
వేళ తప్పక చిరునవ్వుతో
పని చేసుకుపోయే వారికి
కూటి కేమి లోటు?
శ్రమ జీవనం
స్వేద పరిమళాలు వెదజల్లే
ఓ ఆనంద పుష్పం.
నిజాయితీ నవ్య నాగరికత.
సమయపాలనే దానికి పునాది!

పక్షులు పారేవేళ!



ఓ పక్షి వెంట మరో పక్షి!

ఆలా గుంపులు గుంపులుగా

పొట్టలు రెక్కలతో పట్టుకొని

తిండి కొరకై వలసపోయే పేద బతుకును

తట్టిలేపే కలకలారావాలతో

నీలి ఆకాశంలో పరువులు పెట్టే

రకరకాల పక్షులు!

శ్రమ జీవనమే బతుకనీ, సంపాదించుకుని తినేదే కూడనీ
నమ్మిన ఆ పక్షి బతుకులకు
ఏ తాత్త్విక సిద్ధాంతము అర్థము విప్పి చెప్పగలదు?
ఏ మనోజ్ఞానము ఆచరణ
ప్రయోగమునకై యత్నించగలదు?
మానవుల శక్తియుక్తులు చాలని
ఓ ఆరోగ్యకరమైన, ఆదర్శ జీవన సరళి అది!
పొంచి ఉన్న వేటగాని దెబ్బను గుర్తించలేని అమాయకత్వమది.
సెలయేటి స్వచ్ఛంద నీటిలా
మలిన మంటని ఆ బతుకులు
కొన్ని కుయుక్తులకు బలైపోతున్న సంఘటనలు!
ఓ పక్షి నేలకూలితే తోటి పక్షుల ఆర్తనాదాలు!
తుపాకీ గుళ్ల చేతుల్లో
బలైపోతున్న అమాయక ప్రజానీకానికి
ప్రతీక అది!
తిండి కోసం ఒక్కడు, కక్ష కోసం మరొక్కడు,
దురాశతో ఇంకొక్కడు- హింసను చెలరేగిస్తున్నారు!
గుండెల్లో అలజడి గుప్పిస్తున్నారు!
శాంతి కపోతాల నెత్తుటి మరకలు!
చెట్టుపై పుట్టి, చెట్లలో పెరిగే
పక్షులకు నేలపై గండాలు ఎన్నో..!
నేలపై మనుషుల ఆగడాలు ఎన్నో..!!
మానవ సుఖజీవన యత్నానికి
ఎగిరే ఆ స్వేచ్ఛాజీవులు సాక్ష్యం!
వాటి కలకలారావాలు సాక్ష్యం!
వాటి జీవనయానం సాక్ష్యం!!

ఓ కోకిల పాడే వేళ!



అది ఓ ఉషోదయం!

అది ఓ అనురాగ పరివాహకం...

అది ఓ సంపూర్ణ సూర్యబింబోదయం!

లోకాన్ని కప్పిన అజ్ఞానపు చీకటిపొరను

పడమటి సంధ్యలో జారవిడిచి


వేయి వెలుగుల చాందినీ పరచినట్లు

సుషుప్తి నుండి జాగరూకమై

మిణుకుమ కనురెప్పల మధ్యనుండి

పరవళ్ళు తొక్కుతూ
దూసుకువచ్చె ఆ చూపులకు
ఓ స్వాప్నిక దృశ్యరూపం!
రసాల కిసలయ రసముకై
తీరాలు దాటె ఓ నవకోయిల!
వేపచెట్టు చేదుకొమ్మలపై నిలిచి
చీకటిలో దారులు వెతికే ఓ బాటసారిలా
యమునా తటిలో శూన్య దృక్కులతో
గోప బాలునకై విరహంతో
అలమటించే ఓ రాధికలా
నవ్యరసానుభూతికై పరితపించే
ఓ నూత్న దంపతుల
సరస సల్లాపములకు
శృతులు పలికిస్తూ
ఆకులు రాల్చిన చెట్లను, పుట్టలను
పులకింపచేస్తూ
గూడు లేక అల్లల్లాడే జనావళికి
ఓ గూడై నిలిచే గానకళతో
హృదయాలు పులకింపచేసే
ఓ కోయిల
గొంతెత్తి పాడే వేళ

హరివిల్లు




ఓ సుప్రభాతాగమనంలో

ఓ చిదానంద స్వరూప రేఖలా
మేలిమి స్వర్ణ పుటలలో
సప్త వర్ణాల మేలుకలయికలా
ఆవిర్భవించిన ఓ ఆనందవలయం.
భూమి, ఆకాశాలను కొలిచే
ఓ అద్భుత రసానంద

నవరసాలను సప్తవర్ణాల
గర్భంలో నిలుపుకొని
మానవ జీవన గమనానికి
సప్త వర్ణాల మేటిబాటలా
ఇంటి ముంగిట కొలువు తీరిన
రంగుల రంగవల్లులను మీటుతూ
రంగులు అద్దిన ఓ చిత్రపటంలా
మనిషి జీవితంలోని
కష్టసుఖాల అల్లికలా
ప్రకృతి రమణీయతకు
సృష్టి చిత్ర విచిత్ర గతులకు
అష్ట దిక్కులను కలిపే చెలిమితోరణంలా
మానవ హృదయ చైతన్యానికి
ఆయువు పట్టులా
సప్త వర్ణ కాంతులతో
ఓ ఉదయవేళలో
నేత్ర ద్వయం కొలుచుకోలేని
అవనిపై అవతరించిన
ఓ హరివిల్లు.

ఓ తపోవనం



ఆది ఓ తపోవనం!

ఆది ఓ ప్రశాంత నిశాంత సమయం!
పిల్ల తెమ్మెరల గుంపులు
వీవనలై చల్లగా లోకాన్ని నిమిరే సమయం.
యోగ సమాధి నుండి లేచే మునీశ్వరునిలా లోకం
కళ్ళు తెరిచే సమయం!
ఓ నదిలో తెల్లని తెరచాపలో
ఓ పడవ సరంగుల పదాలలో

ఏటికి ఎదురీదుతోంది- ఓ నీటిపక్షుల గుంపు.
కెరటాలపై ఊయల లూగుతూ
ఆనంద లోకాల్లో విహరించే సమయంలో
ఓ పిట్ట ముక్కు ముంచి
జపించే మునీశ్వరునిలా చల్లనీళ్లలో
స్నానాలు చేస్తోంది.
ఓ నీటికొంగ కాబోలు... 'కేర్... కేర్' మంటూ
సూర్యోదయమే లోకోదయమని
గుండెంతా నోరు చేసుకొని
స్వాగతం పలుకుతోంది.
ఆ లేత సూర్యకాంతిలో
బంగారు కాంతులలో
ప్రకృతికి ప్రతిబింబాలై
ఎగిరెగిరి పడే ఆ చేపలు
నదీ గర్భానికే అపురూప పంట!
ఆ నదీ తీరాలలో
ముత్తైదువల చేతిగాజుల
గలగలలో కార్తీక దీపాలు
మరో లోకానికి చూపే కొత్తబాటలు!
జనం చేసే స్నానాలతో
నదిలో ఓ కొత్త సంచలనం-
నీరు లేక ముడుచుకుపోతున్న
ఆ నదీ ప్రవాహానికే
ఓ వింత పులకింత!
అది... ఓ తపోవనం!
అది... ఓ ప్రశాంత నిశాంత సమయం!!

ఓ వానజల్లు



ఉత్తరాన ఉరుములు లేని

ఓ వానజల్లు కురిసింది!

పులకించిన పుడమితల్లి

గుప్పున ఓ వింతవాసన వెదజల్లుతోంది!

స్త్రీగా మారిన బండరాయిలా

మొలకెత్తిన విత్తులు!

వీధుల వెంట కాలవలై పారే నీరు!

తడిసిన పంటచేలలో

పొట్టలు విచ్చిన కంకులు!
వానజల్లుల్లో చిందులేసే
చిన్నారి పిల్లలు-
చిటపట చినుకులకు
ఒళ్ళు జలదరించిన నవదంపతులు
పుడమిని చూసి పులకరించి చిందులేస్తే
అది వానజల్లు!
దూరంగా చిట్టడవిలో
మొలకెత్తి పుష్పించిన చెంగల్వలు
కడిమి చెట్ల మధ్యలో
మోరలెత్తి పరుగులు పెట్టే
లేడి కూనలు!
పొదల చాటు నుండి తొంగిచూసే
ఓ కుందేలు పిల్ల!
భూమిపై ఏడు సంద్రాలు ఉన్నా
మంచినీరు లేనే లేదు.
సాగునీటిని అడగకుండానే
కురిసిపోయేది వాన!
పుట్టగానే అవసరమయ్యేది నీరు-
సకల మలిన ప్రక్షాళనానికి
అవసరమయ్యేది నీరు!
వాన లేనిదే నీరు లేదు-
నీరు లేనిదే తిండి లేదు!
జన జీవన శక్తి నీరు-
జీవితం ఓ పారేనీరు!

ఓ వెలుగు రేఖ



ఓ చల్లగాలి కెరటం

సరిగమలై సంగీతం పాడేవేళ

తూర్పు కొండపై ఓ వెలుగు రేఖ

ప్రకృతి కుంచెపై రూపుదిద్దుకునే వేళ!

బద్ధకస్తులు ఇంకా


దుప్పటి ముసుగులోనే కళ్ళు తెరవక

ఒళ్ళు విరుచుకునే వేళ!

బీడు పడిన పొలంలో, బీటలు వారిన పాదాలతో

కుదువట్టైన భవిష్యత్తు బతుకుతో కుళ్ళు కంపు కొడుతూ,
ఈగలతో, దోమలతో ముసిరే
చెత్తకుండీల చుట్టూ తిరిగే
పలకరించని చిన్నారి బతుకులు!
అమ్మ ఒడిలోని తీపిదనం, నాన్న పిలుపులోని మాధుర్యం,
మనుష్యుల మమకారం...
అందని ఒంటరి బతుకులు!
చెట్టుపై కళ్ళు తెరచిన ఓ వంటరి కాకి 'కావు' మంటూ
ఓ నిండు పలకరింపు!
మంచు బిందువుల్లా బొట్లుబొట్లుగా కారే బాల్యాన్ని
చెత్తకుండీల్లో వెతుకుతున్న మోసపు సంకెళ్లతో బిగుసుకున్న
పసి(డి) చేతులు!
ఉదయ వేళలో పూల చుట్టూ
తిరిగే తుమ్మెద గీతాలు వినిపించని
ప్లాస్టిక్ చెత్తసంచుల రొదలు
దుమ్ము ధూళితో అట్టకట్టిన
స్నానమెరుగని బతుకులు!
మాసిన పాతగుడ్డలతో గుప్పెడు మెతుకుల కోసం
కాల్చిపారేసిన బీడీముక్కల కోసం
తాకట్టు పెట్టుకున్న బతుకులు!
మనుషులు ప్రేమగా పలకరించకపోయినా
ఓ వీధికుక్క 'నీ తోడు నేనున్నా' నని
విశ్వాసంగా తోకాడిస్తూ వెంట తిరుగుతోంది!
నిత్యం లోకానికి ఓ ఉదయం ఉన్నా-
ఏ ఉదయాలు లేని ఆ పసిబతుకులను
ఓ వెలుగు రేఖ జాలిగా చూస్తోంది!

ఓ మంచు బిందువు



ఆ కొలనులో

పచ్చల కాంతిలో మెరిసే తామరాకుపై
మంచి ముత్యంలా జాలువారే
మంచు బిందువులో
నేను చూశాను-
విశాల ఆకాశపు లఘు ప్రతిబింబాన్ని!
కలకలా రావాలతో

రకరకాల, రంగురంగుల విహంగాలను,
చల్లని గాలి కెరటాలకు
అటు, ఇటు ఊగుతూ నాట్యమాడే
చెట్ల కొమ్మలను, రెమ్మలనూ
కొండల ఆవలితీరం నుండి
ఎర్రని రక్తపు రంగుతో
ఉదయించే ప్రభాత సూర్యుణ్ణి
ఆ మంచుబిందువులో
నేను చూశాను!
ఏడు రంగులలో
మెరిసే ఇంద్రధనుస్సును
వెల లేని వజ్రంలా
రూపుదిద్దిన ఆ మంచుబిందువులో
నేను చూశాను!
ఎల్లలు లేని నీ ప్రేమను
నా చిన్నారి గుండెలో ఇమిడించినట్లుగా
ఈ విశాల విశ్వాన్ని
మంచుబిందువులో
నేను చూశాను!

మా వూరి చెరువు




ప్రాతః కాలంలో

గాజుల గలగలతో
రంగురంగుల చీరలతో
మా వూరి చెరువుగట్టుపై
నీటి బిందెలతో కొలువు తీరె
పారాణి పాదాలతో ఆడువారు!
కావడి బిందెలతో మగవారు,
బుచ్చి బుచ్చి తప్పేలలతో

చిట్టిపొట్టి చిన్నారులు-
ఆ చెరువు చుట్టూ చేరుతారు.
ఆ వూరి దేవాలయాల లోని
దేవతామూర్తులను అభిషేకించే
పవిత్ర జలం అది!
వర్ష ఋతువులో ఒడ్డులు తాకుతూ
శరదృతువులో నిండుకెరటాలతో
కూనిరాగాలతో కులుకుతుంది!
శిశిరంలో తరిగిన నీటితో
ప్రశాంత తపోధనునిలా దర్శనమిస్తుంది!
సుప్రభాత సూర్యకాంతిలో
పులకించి మిలమిల లాడుతుంది.
వర్షాలు లేక చిక్కి శల్యమై
అక్రమ కట్టడాలతో
కబ్జాదారుల హస్తాల వలలో చిక్కి
కురు సభలో చెరపట్టిన ద్రౌపదిలా
విలవిల లాడుతుంది!
కప్పల బెకబెకలతో
రంగురంగుల చేపల, పక్షుల
కవ్వింపులు లేక నీటిగుంటలా
నేల అక్కున చేరిన చెరువు
సూర్యోదయంలో కలకలలాడే
ఆ తూర్పు దిక్కులా
తిరిగి మా వూరి చెరువు
కలకల లాడాలని ఎదురుచూస్తున్నా!

ఓ సెలయేటి ఉదయం!




మూగవోయిన గొంతుల యల్ల

నినదిస్తున్న సెలయేటి కెరటాలు!
చీకటిలో మగ్గిన
కారడవి బతుకుబాటల్లో
ఉదయిస్తున్న తొలిపొద్దు రాగాలు!
మోడైపోయిన చెట్లకొమ్మలలో
చెలిమి చిగురింతలు-
చీకటి అడవికే కొత్త అందాలు!

రెక్కలు విప్పిన పక్షిగొంతులతో
స్వేచ్ఛా గీతాలాపనలు!
మోసులెత్తిన జీవితాల పయనంలో
నరనరాల ప్రజ్వరిల్లే కొత్తరాగాలు!
అణగారిన సెలయేటిలో
కొత్త జీవకెరటాలు!
ఎగిరెగిరి పడిలేచే పక్షులు-
వెంటాడే పాముపడగలు-
దాహంతో దరిచేరే
మృగాలు, క్రూర మృగాలు మరెన్నో!
ఏరు దాటే జీవాలు ఎన్నో!
అడవికి నేస్తం ఆ సెలయేరు-
దానికి నేస్తం ఆ ఉదయం!
చిగురించిన కొమ్మలపై
విరిసిన పూలు ఎన్నో!
మోసులెత్తిన పరిమళాలు
ఆ అడవికే ఆనందం!
పూల మధ్యలో కాసిన కాయలు,
మగ్గిన పళ్ళు-
కలకలారావాలతో
కలియదిరిగే చిలుకలకు,
గోరింకలకు విందుభోజనం!

పల్లె ఎదలో...



తొలిపొద్దు పొత్తిళ్ళలో

కొంచెము కొంచెముగా

రేకులు విచ్చుకునే సూర్యరాగంలో

కలకలారావాలతో పరిమళిస్తూ

పల్లవిస్తూ పరిక్రమించే

ప్రకృతి రమణీ మణి మృదుచెక్కిలిపై

సున్నాలా చుట్టుకొన్న నునుసొట్టలా

భువి అంచుపై ఆ.పల్లె!

చేత పట్టిన రక్షక దండము
యముని మహిషపు గంటలా నినదిస్తూ
విషపు జీవులను పరుగులు పెట్టిస్తూ
పొలాలు దున్నే పరశురామునిలా
భుజాన నాగలితో
కిర్రు చెప్పులు శబ్దించుకుంటూ
చీకటిని తరుముకుంటూ
తోకాడిస్తూ వెంట నడిచే వీధికుక్కతో
వేకువలో పొలం వైపు సాగే
ఆ వారసత్వపు వంశవృక్షానికి
వేళ్ళు, ఊడలు, కొమ్మలు, రెమ్మలు... ఎన్నో!
పంట గింజలు ముక్కున కరచి
నేలతల్లి పెదవులపై విచ్చిన
ఏడు రంగుల హరివిల్లులా
పారె పాలపిట్టల, రాచిలుకల,
గోరువంకల, పిచ్చుకల బారుల వెంట
ఎక్కుపెట్టిన బాణాల్లా
ఉండేలు కర్రలతో
బాల్యాన్ని బారులు తీర్చే
చిన్నారు లెందరో!
కోసిన పంట కట్టలను
తలకు ఎత్తి
భువికి పట్టిన పచ్చలగొడుగుల్లా
బారులు సాచిన ఎండలో
కాగిన నేలపై చురుక్కుమనే
పాద ద్వయంతో

గగనంలో గుంపులు గుంపులుగా సాగే
నీలిమబ్బుల నీడల వెంట
భువిపై పరుగులు పెట్టే కూలీలెందరో!
కావడి నిండా నీటికుండలతో
కావడి బద్దల్లా వంగిన శరీరాలు ఎన్నో!
కొలిమిలో మసిబారిన బొగ్గుల్లా
మాడి మసవుతున్న బతుకులెన్నో!
బురద మట్టిలో నారు నాటినాటి
నీరు పోసి కలుపుమొక్కలు
పెరికివేస్తూ
పంటచేనును పసిపాపలా
లాలించి, పాలించి
ఆలచిప్పల్లా అరిగిన
అరచేతులెన్నో!
బతుకు పొద్దంతా
పంటచేనుకు తాకట్టు పెట్టి
పండిన పంటనంతను
దేశానికి ఎత్తిపోసే రైతు
మట్టిలో కలిసేవరకు
మట్టినే సేవించి జీవించే మనిషి
విశ్రాంతి ఎరుగని అవిశ్రాంత జీవి.
పల్లె ఎదలో పుట్టి పెరిగిన మనిషి-
ఈ దేశానికే కంటివెలుగు.

రేపటి ఉదయం!



ఎన్నో యుగాల ఆరంభాలు, అంతిమాలు

చిత్రించుకున్న ప్రపంచ నేత్రంలో

కనిపించే ఓ చిత్రపటం!

తడిసి నేలకొరిగిన ఓ జీవం!

చలనం లేని జీవనచిత్రంలో

మరణ సంధ్యలో

నలిగి నశించిపోతున్న

ఓ శోకదేవతా మూర్తి!

సంఘం చెక్కిన దురాచారాల ఊబిలో
నిలువునా కూరుకుపోతున్నా
కాలు నిలదొక్కుకోవాలనే గాఢ తపన!
మూసిన కళ్ళు తెరిచేలోపల
ముంచుకొచ్చిన వరద నీరు!
పట్టపగలే కమ్ముకొచ్చిన కాలరాత్రి!
కొలిచే ఆస్తులు, అంతస్తులు
నీటిలో కరిగిపోతున్న దృశ్యం!
కంటి ఎదురుగా శవాలుగ
మారుతున్న జనసమూహం!
అయినా... ఆరిపోని కొన్ని ప్రాణాలు!
చేతనంలో అచేతనంగా నిలిచిన
జీవన విషాద రూపం-
చుట్టూ జీవరాశుల మరణ ఘోష
పట్టించుకోక పారిపోతున్న కడలిపొంగు
పట్టుకుని వీడలేని బురద నీరు!
నేల నంటిన మృత కళేబరాలు
కుళ్ళి కంపు కొడుతున్న
భరించలేని మురుగువాసన!
అంతా ప్రళయ కాల బీభత్సం!
నేల వాలిన వృక్షాలతో
మట్టిలో కలిసిన పచ్చదనం!
అది ప్రళయ కాలమా? కానే కాదు!
బతికిన వారి కడుపులో
ఆకలి మంటలు!
దుర్భర మానవ జీవితం!

ఎక్కడో దూరంగా వంటరిగా
మిగిలిన ఓ పసిపాప-
'అమ్మా...' అన్న ఆర్తనాదం...
అమ్మ పేగును కుదిపేసిన మమకారం!
ఏది శాశ్వతం..?
దుఃఖమా? సంతోషమా?
ఏదీ శాశ్వతం కాని అగమ్యగోచరం!
చుట్టూ దాహం తీర్చలేని బురదనీరు!
ముంచుకొస్తున్న అంటువ్యాధుల మధ్య
బతుకు కోసం ఆరాటం..!
తల దాచుకోడానికి
మిగిలిన ఆ చెట్టుపై
గూడు అల్లుకుంటున్న ఓ పిట్ట!
గుప్పెడు మెతుకులు వార్చుకోడానికి
ఏరి తెచ్చుకుంటున్న కట్టె పుల్లలు!
ప్రాణం నిలుపుకోడానికి
తిరిగి ప్రయత్నం!
రేపటి సూర్యోదయం కోసం
తిరిగి ఎదురుచూపు!

ఓ వినూత్న చైతన్యం!



మనిషి గుప్పిట్లో ఒళ్ళు విరిచే కొరడాలా

పతి కనుసన్నల్లో కల్కియై

గృహ నిర్వహణలో యజమానురాలై

భర్త క్రోధాగ్నిలో మాడి అలనాడు

శిలగా మారింది ఓ ఇంతి!

ఆ ఇంతి కన్నీళ్ల మాటున కదలాడే కన్నీటి వ్యధ-

కదిలించ లేదెవరిని?
ఆ గుండె లోతుల్లో కూరుకుపోయిన
కారుణ్యం- కనిపించ లేదెవరికి!
లోకం దృష్టిలో కనిపించేది
చలనం లేని ఆ శిలయేగా!
పతి వెంట కారడవులకు నడిచిన ఆ కారుణ్యమూర్తి
అత్తల సేవా, భర్త సేవా తప్ప-
మరొకటి తెలియని నిండుచూలాలు
లోకాన్ని కన్నెత్తి చూడలేని అమాయక మహిళామణి
వంశోద్ధారణకై ప్రాణాన్ని బలిపెట్ట నిలిచిన త్యాగమూర్తి!
లోకం దృష్టిలో నిందితయై నిలిచిన
ఆ ఇల్లాలికి మరోసారి అగ్ని పరీక్ష తప్పనప్పుడు
తల దాచుకోడానికి
జానెడు చోటు కరవైనప్పుడు భూమాత బద్దలై దారి యిచ్చిన
ఆ మగువ దీనచరిత్ర విన్నవారంతా
తరతరాలుగా కన్నీళ్లు కార్చడం తప్ప
తప్పెవరిదని నిలదీసి ప్రశ్నించే దెవరు?
భర్తల ఆదర్శాలకు బలైపోతున్న ఇంతుల చరిత్ర
తిరగ రాసే దెవరు?
నిండు కురుసభలో
కాల ధర్మాన్ని నిర్దేశించే నీతి కోవిదుల సమక్షంలో
దురహంకారం పడగ విప్పి
తల్లి వంటి అన్న భార్య కొప్పు పట్టి
కట్టిన కోక విప్పుతుంటే
జూదపు పందానికి కట్టేసిన హస్తాలతో
కొలువుదీరిన పంచభర్తల ఎదుట

న్యాయం, ధర్మం, అధికారం గుప్పిట్లో బందీలైన ఇంతుల చరిత్ర
ఆనాడైనా, ఈనాడైనా ఒక్కటే!
సమయాలు, సందర్భాలు వేరు... అంతే!!
పతి మరణిస్తే సతియే కారణమని బలి పశువును చేసి
బలవంతంగా చితిలో విసరుతుంటే
ఆ స్మశాన వాటిక తప్ప ఈ లోకంలో మగువకు తావెక్కడ?
భార్య మరణిస్తే మరునాడే
సంపెంగిలా గుబాళించే భర్తలు-
నేటికీ కొనసాగుతున్న
ఆడ, మగ, న్యాయ భేదాలు!
మారిన కాలంలో
ఇంకా మారని దురాచారాలు!
ఓ రాజారామ మోహనుడు,
ఓ గాంధీ మహాత్ముడు,
ఓ వీరేశలింగం,
ఓ గురజాడ...
మగువల జీవితాలను
వెలిగించిన సూరీళ్ళు!
అయినా మొద్దుబారిన సమాజం!
ఆడామగా ఎల్లలు తుడిచేసే
సమాజం కావాలి!
భయాల గుప్పిట్లో బిగుసుకుంటున్న
మగువల జీవితాలలో
విచ్చుకోవాలి చైతన్యం!
స్త్రీ శక్తి వెలుగు విస్ఫోటనం కావాలి-
ఓ వినూత్న చైతన్యం వెల్లివిరియాలి!

ఓ జననం!



జనన మంటే ఓ ఆనందపు వెల్లువ!

మరణ మంటే గుండెలు పగిలే

ఓ విషాద వెల్లువ!

ఓ ఇల్లాలి కడుపున ఓ పసిబిడ్డ జననం!

అంతవరకు గుండ్రాయి నెప్పులతో


మరణవేదనతో, చావుకేకలతో

తల్లడిల్లిన ఆ తల్లి ఒడిలో ముద్దులొలికే ఓ ముద్దుబిడ్డ!

కోతైనా, కొండముచ్చయినా-

ఎవరి బిడ్డ వారికి ముద్దే కదా!
ఆ స్పర్శకు మోసులెత్తిన ఆ కన్నతల్లి ప్రేమ!
బిడ్డ చుట్టూ అల్లుకున్న కన్నపేగు తీపి!
ఆమె అత్త ముఖంలో
కత్తివాటులా ఓ విషాదచ్ఛాయ!
లోకంలో ఆచారమై
కాలు నిలదొక్కుకున్న దురాచారం!
ఈనాటి వరకట్నం!
నిద్రిస్తున్న తల్లి ఒడి నుండి
పసిపిల్లను విసిరి పారేయాలన్న
ఆ అత్త ఆరాటం!
మూసిన ఆ తల్లి కళ్ళముందు
ఓ ఉష, ఓ కిరణ్ బేడీ,
ఓ సుబ్బలక్ష్మి... నిలిచారు.
ఆ కళ్ళలో ఏదో వింత కాంతి!
రెండు చేతులతో ఆ పసిబిడ్డను
గుండెలకు వాటేసుకుని
విడదీయలేని పేగు బంధమది!
కొడుకైనా, కూతురైనా
మన ప్రేమ ఒక్కటై వెలగాలి!
వారి బాధ్యత ఒక్కటై నిలవాలి!
అత్త బుద్ధిని మార్చే
కొత్త సంకేతమది!
ఈ లోకానికి
ఓ కొత్త జననం!

ఓ పూవు పరిమళించే వేళ!



ప్రకృతి చెక్కిలిపై నొక్కులా

ఓ ఎర్రగులాబి, ఓ ముద్దమందారం

ఓ నవపారిజాతం రేకులు విప్పి

దోసిళ్ళతో అందాల సుగంధాలు

లోకంలో గుమ్మరించిన వేళ!


సప్త స్వర సంగీతమై

ఓంకార నాదమై

ఓ తుమ్మెద ఝుంకారమై

ఓ తుమ్మెద- పూవు, పూవును
పలకరించే వేళ
చెలిమి సిరులు పంచే వేళ
అనురాగ బంధాలు పెనవేసే వేళ
ప్రకృతికే ఓ వింత శోభ!
పుట్టిన పూవు దేవుని పూజకు,
దేవతార్చనకు చేరే వేళ
పుట్టిన జన్మ పరమార్ధమయ్యే వేళ
మగువల జడలో తురిమే పూలు
భోగానికి సంకేతాలు.
భువికి అందం, ఆనందం
ఆ పూదోట!
నీరు కర్వై మొగ్గలు వాడినా-
మేఘం వర్షించక మానదు.
గాలి వీచక మానదు...
నీరు పారక మానదు...
మరో పూవు పుట్టక మానదు!
ఆ దేవుని మెడలో మాలై
ఆధ్యాత్మిక తత్త్వ సంకేతమై
స్థితి లయల మార్గగామియై
వాడి రాలిపోతుంది-
పూవు పరిమళించే వేళ!
ప్రకృతి పరవశించే వేళ!!

ఓ మయూరి పురులు విప్పే వేళ!



ఓ చల్లగాలి కెరటం వీచిన వేళ

ఒళ్ళు జలదరించిన నీలిమేఘం
గగనతలంలో నర్తించిన వేళ
ఓ మయూరి పురులు విప్పి
నర్తించే వేళ
అణువణువూ పులకించి
కొయ్యతో, రెళ్ళుతో, పూచిన పువ్వుతో
పరిమళించే సుగంధంతో

ప్రకృతి స్వాగతం పలికే వేళ
ఇలకే ఓ ఇంద్రధనుస్సు-
జీవకోటికి ఆనందపు వెల్లువ!
ఇంద్రలోక మెక్కడా?
ఆ స్వర్గలోక మెక్కడా?
ఇలలో మయూరి నర్తనకు
సాటి ఎక్కడా?
అందుకునేది ఆనందం
అనుభవించేది స్వర్గం!
పురులు కత్తిరించి
డబ్బు చేసుకునే కసాయివారు ఉన్నా
మయూరి నాట్యమాడక మానదు!
నిర్వికారమైన లోకంలో
చలనం సృష్టించే మయూరి
దాని నాట్యానికి పరవశించిన
నీలిమేఘం కాలమేఘమై
చిటపట చినుకులు వర్షిస్తే
పులకించిన ఆ మయూరి
తాండవించే శివుని రూపమై
నర్తించే దేవతామూర్తియై
మబ్బుల ఆశయానికి సంకేతమై
లోకానికి శుభసూచకమై
మయూరి నర్తించే వేళ-
ఇలకే ఓ శుభవేళ!

సూర్యుడు ఉదయించే వేళ!



సూర్యుడు ఉదయించే వేళే

ఈ పుడమికీ ఉదయ వేళ!

ఆ ఉదయకాంతిని చూడలేని

కొందరు ఆ దుప్పటి ముసుగుల్లోనె

కలలు కనే వారైతే-

కలలు కనడానికి కంటికి నిదురలేని


వారు మరికొందరు!

భూమికి సమాంతర రేఖల్లా

సాగిపోయే జీవితాలు వారివి.
బాధ్యత ఎరుగని బతుకులు
కొందరివైతే-
బాధ్యతలు మోసే బరువులు
మరికొందరివి!
ఎండలో, వానలో నలుగుతూ
దుమ్మూ, ధూళీ మధ్యలో
ఏటిగట్టు బతుకులు కొందరివి!
వారి చేతులు ఎల్లప్పుడూ
ఏటిలోని వలల వైపైతే-
వాటి అల్లికపై
మరికొందరి జీవితాలు!
మరి, ఆమె చేతులు రెండూ
ఆ తట్టల, బుట్టల చాపల
అల్లికల మెలికలపైనే!
ఆ పక్కనే కటిక నేలపై
మారాము చేస్తూ గంతులేసే
పసి పిల్లవానిని గుండెలకు హత్తుకున్నా
చేతిలో అల్లిక ఆగదు.
పసిబిడ్డను కొంగు మాటున
చనుబాలు తాగిస్తూ మురిసిపోతున్నా
గుండె చప్పుడుకు తాళం పలుకుతూ
ఆ చేతులు అల్లిక ఆపవు.
మగనితో తీయని ఊసులకు
మంచులో తడసిన లేతగులాబిలా
శరీరం పులకింతలతో జలదరించినా

ముసిముసి నవ్వుల ముచ్చటలలో
ఆ తట్ట అల్లిక సాగిపోతూనే ఉంటుంది.
సాలెగూడు అల్లిక కంటె
జిగిబిగి ఆమె చేతి అల్లిక!
అల్లిక మిషనులన్నీ
ఆ చేతి నగిషీ ముందు దిగతుడుపే!
ఏటిగట్టు-పగటి ఆవాసం-
ఓ చిన్ని గుడిసె నివాసం!
ఒక్కరోజు అమ్మకం కరవైతే
జీవితమే అగాధం!
ఒక్క అడుగు జారితే
జీవితమే ఓ అగాధం!
చేనుకు నీరు దొరికితే
కడుపు నిండా పంటే!
పని దొరికితే వారికి
కడుపు నిండా కూడే!
అది గంజికూడైనా
గొడ్డు కారపు ముద్దయినా
ఆకాశానికి నిచ్చెనలు వేయలేరు!
రేపటి తరం కోసం ఆశ లేదు!
తరతరాలకు అందించే
వారసత్వం ఆ తట్టల అల్లికే!
ఉదయం ఉదయించే చేతులు-
అస్తమయంలో అస్తమించే అల్లికలు!
ఎందరి జీవితాలకో బతుకుబాటలు!!

ఉదయించే ఓ హృదయం!



నీలి గగనానికి అందం ఆ మేఘం!

మేఘానికి అందం గమనం!!
నేలపై మనిషికి ఆదర్శం-
ఆ స్వేచ్ఛాగమనం!
పక్షికి అందం రంగురంగుల రెక్కలు-
ఆ రెక్కలకు అందం వేగం!
అదే చైతన్యానికి పునాది!
అదే మనిషికి ఆదర్శం!!

గొంతెత్తి పాడే కోయిల,
కోయిల పాటకు చిగురించే చెట్లు, పుష్పించే రెమ్మలు,
నేలంతా గుబాళించే వసంతం!
వసంతానికి అందం ఆ కోయిల-
కోయిలకు అందం ఆ గొంతు!
మనిషికి ఆదర్శం ఆ గొంతులోని మాధుర్యం!
అది గుండె గుండెను తాకి నేలంతా గుబాళించాలి!
గుప్పెడు మట్టి చాలు- విత్తు మొలకెత్తడానికి!
జానెడు నేల చాలు- మనిషి బతకడానికి!
ఒక్కక్షణం చాలు- మనిషి మట్టిలో మట్టైపోవడానికి!
అందుకే జనన మరణాలు- గతాను గతాలు...,
స్థితి, లయ సమ్మోహనాలు!
మనిషికి ఉదయం జననం- అస్తమయం మరణం!
స్థితి, లయలు సహజ నేస్తాలు! మనిషి జీవనానికి పాదపీఠాలు!!
అంతరంగంలో అగ్నిపర్వతంలా
జీవం పోసుకుంటున్నా బహుముఖాలతో
వెంటాడుతున్న యుద్ధోన్మాదం!
తెల్లని పాలరాతిపై ఎర్రని రక్తపు మరకలు!
చీకటిని తరిమే సూర్యచంద్రుల
వెలుగు గంపల కెత్తి తీసుకొచ్చే శక్తి మనిషికి ఆదర్శం!
వెలుగు వాకిళ్ళలో నిలబడి తన ఛాయలో తానై
ఆత్మ స్వరూపాన్ని దర్శించే
అంతరంగమే ఆదర్శం మనిషికి!
విశ్వశాంతికై దోసిలి పట్టి
యుగయుగాలలో శాంతికాముకుడై
ఉదయించే ఓ హృదయం మనిషి

ఉదయ రేఖలు



ఓ అర్ధరాత్రి తూర్పుకొండపై

సూర్యోదయమైన వేళ!

'వందేమాతరం' అంటూ

కోటి గొంతులతో

భరత మాతను కీర్తించే వేళ!


ఆసేతు హిమాచలం

దేశభక్తితో దద్దరిల్లిన వేళ!

భరత మాత సంకెళ్ళను ఛేదించిన వేళ!

'జెండా ఊంఛా రహే హమారా!'
అంటూ ఆబాలగోపాలం
త్రివర్ణ పతాకాన్ని
గగన తలంలో ఎగురవేసిన వేళ!
ప్రజాశక్తికి శుభోదయం...
దేశ ఐక్యతకు ప్రబోధం!
స్వచ్ఛతకు సంకేతమై
శాంతికి నిలయమై
తెల్లని డ్రస్సులతో వెలుగుతోరణాలై
బారులు తీరిన ఆ పసిపిల్లల
చేతులలో ఎగిరే
ఆ త్రివర్ణ పతాకం
భారత జాతికి గర్వకారణం..,
దేశభక్తికి ప్రబోధ గీతం!
ప్రపంచ దేశాలకి ఆదర్శ సూత్రం!!
త్యాగానికి, ధర్మానికి ప్రతినిధులై
రేపటి దేశ రక్షకులై
ఉదయంలో ఉదయించే
ఉదయ రేఖలు ఆ పసిపిల్లలు!

ఉదయించేకిరణం



అద్భుత నేత్ర ప్రపంచపు

సరిహద్దుల కొలకుల నుండి

ఓ కాటుకచుక్కలా చేరి

అదృశ్యమైపోతున్న

ఆ కన్నీటి బొట్టులో

నే చూస్తున్నాను-

పడుగు పేకల్లా అల్లుకుపోయిన

బంధాల, అనుబంధాల

సమైక్యతా రాగ ధారలను!
ప్రపంచ రంగంపై నర్తించే
సప్త స్వర రాగాల వలె
చిగురించిన ప్రేమానురాగాల
పల్లవుల చిత్రవిచిత్ర గతులను!
ప్రళయకాల సంద్రమై
పొంగి విరజిమ్మే
క్రోధావేశాల కారుచిచ్చులను!
అనుభవాల సానపై
అరగదీసిన జ్ఞాపకాల సుగంధంలా
గుబాళించే ఆ కన్నీటిబొట్టులో
తప్పిపోసే గుండె చప్పుళ్ళను!
ఉవ్విళ్ళూరించే ఆనంద సంగమాలను!
జనన మరణాల భ్రాంతి, విభ్రాంతి
మేళ తాళాల చప్పుళ్ళను!
ఆ కన్నీటి బొట్టులో చూస్తున్నాను-
గుండె గుడి నుండి చేరి
అదృశ్యమయ్యే ప్రాణవాయువులా
కరిగి కరిగి నీరయ్యే
ఆ కన్నీటి బొట్టు మెరుపులో
ప్రతి ఉదయంలో
ఉదయించే కిరణంలా
తిరిగి వికసించే
ఓ ఆనంద బాష్ప బిందువును
నే చూస్తున్నాను!

ఓ మహోదయం!




ఎన్ని ఉగాదులు-

ఎన్ని వసంతోత్సవ
నవ పరిమళాల తోరణాలు
ఈ జీవన కాల యానంలో?!
ఎన్ని అనుభవాల కవ్వింపులు
ఎన్ని నవ యవ్వన సోయగాలు
ప్రకృతి, పురుషుల సమాగమంలో
ఎన్ని అనురాగ సోయగాలు-

సుడులు చుట్టే హృదయ పరిష్వంగాల
ఈ అరువది వత్సరాల కాల చక్ర నేమిలో?!
చేదు, తీపి జ్ఞాపకాల
వగరు, కారం అనుభవాలు
నేర్పే జీవితపాఠాలు ఎన్నో!
చీకటి వెలుగుల ఖత్తికపై సుఖ దుఃఖాల పడుగు పేకలతో
అల్లుకుంటాయి రంగుల చిత్రపటాలు-
తోలు బొమ్మలై ఆడు జీవితాలు ఎన్నో!
కష్టాలనే తలచుకుంటూ కాలాన్ని ఉరితీస్తే
కళ్ళనిండా పూసేవి కన్నీళ్ల పూలే-
మరుగున పడేది కంటిచూపే!
పండుగలు, పబ్బాలలో ఖుషీలు చేయకపోయినా
ఎదురొచ్చే చీకటిని ఛేదించుకుంటూ
బీడు పడిన పొలాలలో పచ్చని పైరులు మొలకెత్తించే
కష్టజీవి మనిషి!
సంసార సాగరంలో గజ ఈతగాళ్లై ఈదేది
ఇంటి ఇల్లాలే!
సుడిగుండాలై ఎన్నో సమస్యలు
ముంచుకొస్తున్నా
పూలకార్లై వెలుగుతారు!
కదిలే చైత్రరథానికి తప్పవు-
గ్రీష్మ తాపాలు, అతివృష్టి అనావృష్టులు,
చలిగాలుల ఒత్తిళ్ళు!
ఆకులు రాల్చాకే చెట్టు చిగురించేది-
మహోదయానికి
పచ్చతోరణమై నిలిచేది!!

ఓ నవోదయం!



నా గుండె నిండా భయం-

అంతా చీకటి!

కళ్ళు కనబడుతున్నా-

మాట పలుకుతున్నా-

నా మనసంతా చీకటి!

అంతా భయం; భయం!!

నా చుట్టూ వెలుగు...

చీకటే లేదు.

అయినా భయం!
దొంగలకా? దోపిడీలకా? దొరలకా?
ఆయుధాలకా?... కానే కాదు.
భయం గుప్పిట్లో నేను!
ధైర్యం ఇచ్చేది- ఖాకీ డ్రస్సుల పోలీసులు కాదు!
తప్పుడు మాటలతో, తప్పుడు చేతలతో
అత్యాశలతో, అన్యాయాలతో
చీకటి దారులు పడితే మనసు నిండా భయం!
జీవితమంతా భయం... భయం!!
అంతా బ్లాక్... బ్లాక్!
బ్లాక్ అంటే భయమే కదా!
సొంత లాభం కొంత పొరుగువానికి పంచితే-
గుండెలో ఓ గుడ్డిదీపమైనా వెలుగుతుంది.
చీకటి తరిమివేయడానికి ఓ గుడ్డిదీపమైనా చాలుగా!
గుండెలో భయం గుప్పిట లోకి వస్తుంది!!
సూర్యుడెప్పుడూ తూర్పుగుండె లోనే ఉదయిస్తాడు!
పడమర అస్తమిస్తున్నా-
తిరిగి తూర్పునే ఉదయిస్తాడు!
నా గుండె తూర్పు దిక్కయితే
నా గుండె నిండా వెలుగే!
ఇంక నాకు భయమెక్కడ?
నా గుప్పిట్లోనే దాగుంది భయం!
జననం, మరణం, కష్టం, నష్టం మామూలే..,
సుఖం, దుఃఖం అలవాటే!
మనిషి స్వార్థంతో అస్తమిస్తున్నా-
నవోదయంలో తిరిగి ఉదయిస్తాడు!

నగరంలో ఓ ఉదయం



అరుణ కిరణాలకు ఎదురుగా

ఆరోగ్య దీపాల్లా ఆటస్థలాలకు
పరుగులు పెట్టే ఆడ, మగ
తేడాలు తెలియని పిల్లలు!
చీరలు, జాకెట్లు వదలి
మిడ్డీలు, షార్టులు తొడిగి
భుజాన బాగ్‌లతో, చేత పుస్తకాలతో
చురుకుతనానికి ప్రతీకలుగా

చదువులకై సాగిపోయే
ఈతరం నవతరం యువతరం-
ఈ దేశానికి అభ్యుదయ తరం!
పాల పాకెట్ల పిలుపులతో
ఇల్లాళ్ళు తలుపు తెరవగానే
ఉదయలక్ష్మిలా ఇంట అడుగు పెట్టిన అరుణకాంతి!
'కాఫీ... కాఫీ!' అనే భర్త పిలుపులు,
'బెడ్ కాఫీ!' అంటూ బెడ్ మీదనుంచే
పిలిచే భార్యామణులు కొందరు!
కాలం మారినప్పుడు అన్నీ సహజమే!!
తెల్లారకుండానే టీ.వీ. ఆనులు...
ఇంక ఏ పని చెయ్యాలన్నా విసుగే కదా!
వీధి నల్లాల ముందు గుట్టలుగా
బిందెలపై బిందెలు!
బొట్లు బొట్లుగా చేరే నీరు!!
బిందువు బిందువు కలిసి సింధువైనా-
ఇక్కడ బిందువులు, బిందువులు కలిసినా
ఓ బిందె కూడా నిండదు!
ఇగ సిగపట్లు నిత్యం మామూలే!!
ఓ దేవాలయంలో సుప్రభాత గీతాలు-
భక్తులలో కలిసి దొంగలు
ఓ పూజారి పూజ్యుడై దేవుని రక్షించిన తీరు-
ఆ దేవాలయంలో ఓ అద్భుతం!
ఇళ్ళలో గిన్నెలు తోమే చప్పుళ్ళు-
వీధులు ఊడ్చే చీపుళ్ళ చప్పుళ్ళు!
మోటారు సైకిళ్ల, కారుల, ఆటోల హోరను మోతలు!

స్టేషనులో రైలు కూతలు!!
అస్తవ్యస్త చప్పుళ్ళతో ఒళ్ళు విరిచిన ఓ ఉదయం!
ఉదయంలో ఓ జోరువాన
చిత్తడి చిత్తడైన రోడ్లు!
నిండిన మోరీల మురికినీరు-
రోడ్ల నిండా ప్రవహించే వరదనీరు!
ఎప్పుడో నవాబుల కాలంనాటి నిర్మాణాలు-
రిపేరు కాని అండర్‌గ్రౌండు డ్రైనేజీలు!
పని దొరక్క పస్తులుండే కూలీలు-
ఆకలితో తల్లడిల్లే పసికూనలు!
సెంటర్లలో బాంక్ ఎకౌంట్లున్న
ఖరీదైన బిచ్చగాళ్ళు!
రాచిలకల పంజరంతో చిలకజోస్యం చెప్పేవారు!
బాంక్ అప్పులు లెక్కేట్టేస్తూ కార్లలో తిరిగేవారు!
చిట్‌ఫండ్‌లు, బాంక్‌లు
దివాళాలు తీయిస్తే
బతకలేక ఉరేసుకున్న తండ్రులు-
శోకంలో బెంబేలు పడే కుటుంబాలు!
నగరంలో ఫ్లాట్ల మోజులు,
భవనాలు కూలిపోతున్నాయి!
ప్రతినిత్యం దినపత్రిక తెచ్చే
కొత్త వార్తల మోజు!
అన్నీ మోజులే!
మోజుల ముసుగేసుకున్న
నగరంలో ఓ ఉదయం!